సాక్షి శ్రీకాకుళం

శనివారం । 9 । సెప్టెంబర్ । 2023



శివారుకు ప్రాధాన్యత

శివారు భూములకు ప్రాధాన్యమివ్వనున్నారు. ఈ మేరకు మంత్రి సీదిరి ఆదేశించారు.

- 8లో



సమస్యలు పరిష్కరించాలి

లావేరులో జగనన్నకు చెబుదాం నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

- 8లో

శ్రీముఖలింగంలో ఘనంగా వరలక్ష్మీ వ్రతాలు

జలుమూరు: దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీముఖలింగం ప్రధాన ఆలయంలో వారాహి అమ్మవారికి శ్రావణ మాసం నాలుగో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గణపతి పూజలో ప్రారంభించి అమ్మవారికి అర్చనలు, ఏకవార అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

శ్రావణం..పావనం



శ్రీకాకుళంలో విద్యాలక్ష్మిగా విజయదుర్గ



నరసన్నపేట: శాకంబరిగా మహాలక్ష్మి అమ్మవారు

శ్రీకాకుళం కల్చరల్: పవిత్ర శ్రావణ శుక్రవారాన జిల్లాలోని అమ్మవారి ఆలయాలు కళకళలాడాయి. అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించడంతో భక్తులు తిలకించి పులకించిపోయారు.

'పాత పెన్షన్ విధానమే మేలు'

ఆమదాలవలస: నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేస్తూ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ యూనియన్ వాల్తేర్ డివిజనల్ కోఆర్డినేటర్ టీవీ మాహేశ్వరరావు కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక కాంగ్రెస్ యూనియన్ శ్రీకాకుళం రోడ్డు బ్రాంచ్ పదో బయో జనరల్ బాడీ మీటింగ్ సందర్భంగా శ్రీకాకుళం రోడ్డు రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో నూతన కార్యవర్గ ఎన్నిక, సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే కార్మికుల అర్బన్ బ్యాంకులో జరుగుతున్న అవకతవకలను వివరించారు. ఈ సందర్భంగా శ్రామిక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా జి.నాగేశ్వరరావు, కార్యదర్శిగా ఎస్.దంతేశ్వరరావులతో పాటు పదిమంది కార్యవర్గ సభ్యులు, యూత్ కార్యవర్గ సభ్యులుగా 12 మందిని ఎన్నుకున్నారు.

ప్రగతి తప్పించే పచ్చకుట్ర



- అభివృద్ధికి అడ్డంకిగా టీడీపీ అండ్‌కో
- సీఎం వైఎస్ జగన్ చెప్పినవన్నీ చేసేస్తుండటంతో తట్టుకోలేకపోతున్న ఎల్లో మీడియా
- చంద్రబాబు డైరెక్షన్‌లో విషం చిమ్ముతున్న ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలు
- ప్రజల్ని రెచ్చగొట్టి లబ్ధి పొందాలని చూస్తున్న పచ్చనేతలు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులు చూసి టీడీపీ, ఎల్లో మీడియా ఓర్వలేకపోతోంది. చెప్పినవన్నీ సీఎం జగన్ చేసేస్తుండటంతో బాబు అండ్ కో తట్టుకోలేకపోతున్నారు. రోజుకో రకంగా విషం చిమ్మడం, స్థానికులను రెచ్చగొట్టడమే పనిగా పెట్టుకున్నారు. సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన హామీ మేరకు కిడ్నీ రీసెర్చ్ కమ్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఇప్పటికే నిర్మితమైంది. ఉద్దానం మంచినీటి ప్రాజెక్టు పూర్తయింది. మహేంద్ర తనయ ఆఫ్‌షోర్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మరోవైపు వంశధార లిఫ్ట్ ఇరిగేషన్ యూనిట్ ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. ఇంకోవైపు మూలపేట పోర్టు పనులు జెట్ స్పీడ్‌లో జరుగుతున్నాయి. ఇంకేముంది టీడీపీ అండ్‌కోకు కళ్లు బైర్లు కమ్ముతున్నాయి. చూసి ఓర్వలేక మూల పేట పోర్టు పనులపై పడ్డారు. విషం చిమ్ముతూ స్థానికులను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఏదో ఒక రకంగా మూలపేట పోర్టునైనా అడ్డుకుని, పనులు జరగకుండా బ్రేక్ వేయాలని చూస్తున్నారు.



శరవేగంగా మూలపేట పోర్టు పనులు

వైఎస్ జగన్ ఇచ్చిన హామీలు అమలు చేయరనే భ్రమలో ఇన్నాళ్లూ పచ్చగుంపు ఉండేది. కొన్నాళ్లు పనులు జరగలేదని దుమ్మెత్తిపోసింది. మరికొన్నాళ్లు పనులు పడకేశాయని దుష్ప్రచారం చేసింది. ఇంకొన్నాళ్లు పనులు నిలిచిపోయాయని విష ప్రచారానికి ఒడిగొట్టింది. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇవేవీ పట్టించుకోలేదు. అనుకున్నవన్నీ చేసేసింది. పది పైసల పనిచేసి వంద రూపాయల ప్రచారం చేసుకున్నట్టుగా కాకుండా సైలెంట్‌గా చేయాల్సిన కార్యక్రమాలన్నింటికీ శ్రీకారం చుట్టింది. రూ.50కోట్లతో కిడ్నీ రీసెర్చ్ కమ్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం ఇప్పటికే పూర్తి చేసేసింది. రూ.700కోట్లకు పైగా వ్యయంతో చేపట్టిన ఉద్దానం మంచినీటి ప్రాజెక్టు నిర్మాణం చేపట్టేసింది. ఇప్పుడీ రెండూ ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. ముందే చెప్పినట్టుగా వంశధార జలాలను నిర్దేశిత ఆయకట్టుకు నీరందించే ఉద్దేశంతో లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులు పూర్తి చేసింది. పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాలకు తాగునీటితో పాటు సాగు నీరు అందించేందుకు దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తలపెట్టిన ఆఫ్‌షోర్ ప్రాజెక్టు పనులను శరవేగంగా చేపడుతోంది. ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులన్నీ పూర్తి చేస్తోంది. నాగావళి–వంశధార నదుల అనుసంధానం ప్రాజెక్టు పూర్తి కావస్తోంది. వంతెనలు, రోడ్లు, పక్కా ఆస్పత్రి భవనాలు, విద్యాలయాలు.. ఇలా ఒకటేంటి అన్నీ ఏకకాలంలోనే జరుగుతున్నాయి. నాడు వైఎస్సార్ హయాంలో ఏ రకంగానైతే ల్యాండ్ మార్క్ ఉండేలా అభివృద్ధి పనులు జరిగాయో అంతకుమించి ఇప్పుడు జరుగుతున్నాయి. చరిత్రలో నిలిచిపోయేలా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. దీంతో టీడీపీ నాయకులకు, ఎల్లో మీడియాకు వణుకు పుట్టింది. దీంతో ఏదో ఒక రకంగా ప్రభుత్వానికి అప్రతిష్ఠ తీసుకురావాలని, గందరగోళం సృష్టించి రెచ్చగొట్టేందుకు ప్రేరేపిత కార్యక్రమాలు చేపడుతున్నాయి. చంద్రబాబు సభలకు, లోకేష్ యువగళం పాదయాత్రకు ప్రజా స్పందన లేక డైవర్షన్ రాజకీయాల్లో భాగంగా ఎక్కడికక్కడ దాడులకు పాల్పడుతున్నట్టు.. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులపై కూడా లేనిపోని దుష్ప్రచారం చేసి, ఏదో ఒక రకంగా అడ్డుకోవాలని చూస్తున్నాయి.

మూలపేట పోర్టు పనులను అడ్డుకునే కుట్ర

ప్రస్తుతం జిల్లాలో స్పీడ్‌గా జరుగుతున్న మూలపేట పోర్టు పనులను అడ్డుకోవాలని టీడీపీ, ఎల్లో మీడియా కుట్ర పన్నాయి. ఇది కూడా పూర్తయితే టీడీపీ పుట్టి మునగడమే కాకుండా అచ్చెన్నాయుడు, గౌతు ఫ్యామిలీ రాజకీయాలకు ఫుల్‌స్టాప్ పడుతుందన్న భయంతో అడ్డుకోవడమే పనిగా పెట్టుకున్నాయి. ఓ మాజీ సర్పంచ్, మండల పార్టీ అధ్యక్షుడిని ముందు పెట్టి, వారి వెనక ఓ 20 మందిని పంపించి తరుచూ పోర్టు పనులు అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. అయినప్పటికీ సానుకూలత రాకపోవడంతో స్థానికులను రెచ్చగొట్టేందుకు దుష్ప్రచారం చేస్తోంది. ఒకరోజు టీడీపీ నాయకులు, మరో రోజు వారికి వత్తాసు పలుకుతున్న రాజకీయ నాయకులతో కలిసి పోర్టు పనులకు ఆటంకం కల్పిస్తుండగా, వారికి కొనసాగింపుగా ఈనాడు పత్రిక విషం చిమ్మే కథనాలు ప్రచురిస్తోంది. దాని వత్తాసుగా ఆంధ్రజ్యోతి అసత్యాలను వల్లె వేస్తూ స్థానికులను భయాందోళనకు గురి చేసేలా కథనాలు వండి వార్చుతోంది. వీరి గూబ గుయ్యిమన్నట్టుగా జిల్లా యంత్రాంగం అసత్య రాతలను ఖండించడమే కాకుండా వారి ఉద్దేశాలను కడిగిపారేసేలా, కుట్రలను చిత్తు చేసేలా బహిరంగ ప్రకటనలను విడుదల చేస్తోంది. తామెన్నీ రాసినా ఏ ఒక్కరూ అడగరు.. పట్టించుకోరు అన్నట్టుగా రాస్తున్న కథనాలకు అధికారులు సైతం చెక్ పెట్టడం వారు ఊహించలేదు. జిరాయితీ భూముల్లో ఉన్న చెట్లకే పరిహారం ఇస్తామని యంత్రాంగం మొదటి నుంచి చెబుతుండగా దాన్నీ వక్రీకరించి ప్రభుత్వ భూముల్లో ఉన్న చెట్లకు కూడా పరిహారం ఇస్తామని చెప్పి అన్యాయం చేశారని 'ఈనాడు' తప్పుడు కథనాలను రాసింది. ఇలాంటివి అనేక ఇవ్వని హామీలను ఇచ్చినట్టు పత్రికలో రాసి ప్రజల్ని గందరగోళానికి గురిచేసి, రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తోంది. మూడు అడుగుల ఎత్తు చేసిన భూముల్లో నిర్వాసితులకు పునరావాసం కల్పిస్తుంటే... ముంపు ప్రాంతంలో పునరావాసం కల్పిస్తున్నారని అవాస్తవాలతో 'ఆంధ్రజ్యోతి' తప్పుడు కథనాలు వండి వార్చింది. ఇలా రోజూ మూలపేట పోర్టుకు వ్యతిరేకంగా దుష్ప్రచారం చేస్తూనే ఉంది. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు కనుసన్నల్లో ఆయన అనుచర వర్గం అడుగడుగునా అడ్డుకునే ప్రయత్నం చేస్తుండగా, చంద్రబాబు డైరెక్షన్‌లో ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలు తప్పుడు కథనాలు రాసి ప్రజల్ని రెచ్చగొట్టాలని చూస్తున్నాయి. కాకపోతే, స్థానికులెవరూ ఆ కథనాలను, దుష్ప్రచారాన్ని, టీడీపీ నేతల కుట్రలను నమ్మడం లేదు. కళ్ల ముందు జరుగుతున్న అభివృద్ధిని చూసి సంతోషిస్తున్నారు.




పోర్టులో నిర్మాణాలు



ముంపు లేదు

మూలపేట పోర్టు నిర్వాసితులకు కేటాయించిన పునరావాస స్థలం ముంపు ప్రాంతం కాదు. రేటు అయిన మా వ్యవసాయ భూములను అభివృద్ధికి సహకరించి ఇచ్చాము. పునరావాస ప్రాంతం అంతా మట్టి వేసి మూడు అడుగులు ఎత్తు చేశారు.

– కర్రి కాంతారావు, రైతు, నౌపడ



నిరాటంకంగా పనులు

పునరావాస కాలనీలో పనులు నిరాటంకంగా జరుగుతున్నాయి. నాణ్యతతో కూడిన పనులను చేపడుతున్నారు. మట్టి వేసి ఆ ప్రాంతం అంతా ఎత్తు చేశారు. యంత్రాల సాయంతో పనులు వేగంగా జరుగుతున్నాయి.

– పి. రవికుమార్‌రెడ్డి, నౌపడ

ఒక్క అవకాశం ఎందుకివ్వాలి బాబూ..?

- మంత్రి ధర్మాన ప్రసాదరావు



మాట్లాడుతున్న రాష్ట్ర రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

గార: చంద్రబాబుకు ఒక్క అవకాశం ఎందుకివ్వాలో చెప్పాలని, 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉండి శ్రీకాకుళం జిల్లాకు ఏం చేశారో చెప్పగలరా అని రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. గార మండలం కొర్లాం సచివాలయం పరిధి కొమరవానిపేట గ్రామంలో సర్పంచ్ వారాధి రవికుమార్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం వచ్చాక ఇంతవరకు ఏం చేశాం, ఇంకా ఏం చేయాలన్నది తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం చేపట్టామని చెప్పారు. పైసా లంచం తీసుకోకుండా ఇంటి వద్దకే సంక్షేమం అందిస్తున్నామని, అర్హులందరికీ సంక్షేమం అందించాలన్నదే పథకం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ ప్రభుత్వంలో 32 లక్షల ఎకరాల భూమిని కొని పేదలకు అందించామని చెప్పారు. మత్స్యకారులు తమ సమస్యలు చెప్పుకోవడానికి వెళ్తే చంద్రబాబు 'తొక్క తీస్తా' అని వ్యాఖ్యానించారని గుర్తు చేశారు. వైఎస్సార్ సీపీ మాత్రం మత్స్యకారుల అభివృద్ధికి కృషి చేస్తోందని తెలిపారు. గతంలో రిమ్స్‌కు వెళ్తే వైజాగ్‌కు పంపించేవారని, ఇప్పుడు ఆ ఆస్పత్రిని అభివృద్ధి చేయడంతో పాటు మత్స్యకార యువకుడిని కమిటీ సభ్యుడిగా నియమించామన్నారు. అప్పులన్నీ తీర్చేస్తానని చెప్పిన చంద్రబాబు తీరా అధికారంలోకి వచ్చాక డ్వాక్రా రుణాలను చెల్లించక ఇబ్బందులు పడిన సంగతి మహిళలు మరిచిపోవద్దన్నారు.

నేటి నుంచి తెరుచుకోనున్న జీడి పరిశ్రమలు

కాశీబుగ్గ: జీడి పరిశ్రమలు ఎట్టకేలకు శనివారం నుంచి తెరుచుకోనున్నాయి. తొమ్మిది రోజుల పాటు పరిశ్రమల బంద్ జరగ్గా కార్మికులు, వ్యాపారులు పరస్పర ఆమోదం మేరకు శుక్రవారం సంయుక్త సమావేశం నిర్వహించి సమస్యలు చర్చించుకున్నారు. చర్చలు సఫలం కావడంతో పరిశ్రమలు తెరుస్తామని పలాస కాష్యూ మాన్యుఫ్యాక్చర్ అసోసియేషన్ వారు తెలిపారు. శనివారం పరిశ్రమలు తెరుచుకోవచ్చని, సోమవారం నుంచి పూర్తి స్థాయిలో పనిచేస్తాయని అన్నారు.

ఎక్స్‌లెన్స్ అవార్డులకు 19లోగా దరఖాస్తు చేసుకోవాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఏపీ టూరిజం ఎక్స్‌లెన్స్ అవార్డులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పర్యాటక సాంస్కృతిక అధికారి ఎన్.నారాయణరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈనెల 27వ తేదీన నిర్వహించనున్న ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని అవార్డులను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ట్రావెల్, టూరిజం ఇండస్ట్రీలోని వివిధ రంగాల్లో ఉత్తమ సేవలందించి ప్రతిభ కనబరిచిన, సేవలందిస్తున్న వారు ఈనెల 19వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దరఖాస్తు, ఇతర వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టూరిజం.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. పూర్తి చేసిన దరఖాస్తులను వెబ్‌సైట్ ద్వారా అప్‌లోడ్ చేయాలన్నారు. ఎంపికైన వారికి అవార్డులు బహూకరిస్తామని తెలిపారు.

లేఅవుట్ల పరిశీలన

ఎచ్చెర్ల క్యాంపస్: పంచాయతీ కార్యదర్శులు దోమాం, మెట్టపేట గ్రామాల్లో రియల్ ఎస్టేట్ లేఅవుట్‌లను శుక్రవారం పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శుల రెండో విడత పునశ్చరణ శిక్షణ ఎచ్చెర్ల జిల్లా సాంకేతిక శిక్షణ కేంద్రంలో జరుగుతోంది. అందులో భాగంగా శుక్రవారం క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు. ఈ పరిశీలనలో లే అవుట్లు పరిశీలించారు. లేఅవుట్ అప్రూవల్ మ్యాప్ పరిశీలించారు. ప్రస్తుతం లే అవుట్ల ఏర్పాటుకు సుడా అనుమతులు తీసుకోవాలని జెడ్పీ కార్యనిర్వహణాధికారి ఆర్.వెంకటరామన్ అన్నారు. వ్యవసాయ భూమి వ్యాపార భూమి మార్పు (నాలా) రుసుం చెల్లించటం, 40 అడుగుల రోడ్డులు, 10 శాతం రిజర్వ్ స్థలం కేటాయింపు, ప్రభుత్వ స్థలాలు, చెరువు గట్టు వంటివి ఉంటే విడిచి పెట్టటం వంటివి కీలకంగా చెప్పారు. ప్లాట్లు కొనేవారు సైతం అధికారులను సంప్రదించి కొనుగోలు చేయాలని సూచించారు. ఈ శిక్షణకు రీసోర్సు పర్సన్లుగా డీటీసీ పీవో కృష్ణ, జ్యోతి శ్రీనివాస్, లోకనాథ్, సీహెచ్ అప్పారావు పాల్గొన్నారు.

ఉపాధి పథకం సిబ్బందికి మెమోలు

పోలాకి: మండలంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న 22 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు, ఏడుగురు టెక్నికల్ అసిస్టెంట్లకు ఎంపీడీఓ ఉషశ్రీ శుక్రవారం మెమోలు జారీచేశారు. భువన్ జియోట్యాగింగ్ పనుల్లో అలసత్వం, రికార్డుల నిర్వహణ లోపం తదితర అంశాలను దృష్టిలో ఉంచుకుని మెమోలు జారీ చేసినట్లు ఆమె తెలిపారు. మండలంలో 130 పనులకు గాను కేవలం ఒక్కదానికి మాత్రమే జియోట్యాగ్ చేయటంతో ఎంపీడీఓ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈసీ రామకృష్ణతో సహా సిబ్బంది అందరూ బాధ్యత వహిస్తూ నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని ఆమె ఆదేశించారు.

పాముకాటుతో మహిళ మృతి



తండ్యాల లక్ష్మి

గార: మండలంలోని నిజామాబాద్ పంచాయతీ భైరివానిపేట గ్రామానికి చెందిన మహిళ రైతు తండ్యాల లక్ష్మి (49) పాముకాటుతో మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మి శుక్రవారం సాయంత్రం తన వరి పొలంలో పనిచేస్తూ గట్టు వద్దకు వచ్చేసరికి పాము కాటు వేసింది. వెంటనే సమీప రైతులు రోడ్డు వద్దకు తెచ్చి 108 వాహనానికి సమాచారం అందించారు. చికిత్స కోసం తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

'విద్యార్థులు జీవితం విలువ గుర్తించాలి'

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు జీవితం విలువ గుర్తించాలని హైదరాబాద్‌కు చెందిన కలామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యూత్ ఎక్సలెన్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, లైఫ్‌స్కిల్స్ ట్రైనర్, రచయిత నరేష్ ఇండియన్ అన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఒక్క రోజు వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత క్రమ శిక్షణ, లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు. లోపాలు ఉంటే సరిదిద్దుకునే వారు జీవితంలో ఉన్నత స్థాయికి వెళ్తారని, నిర్లక్ష్యంగా వ్యవహరించేవారు వెనుకబడిపోతారని అన్నారు. అనుకూల వాతావరణం సృష్టించుకోవటం, అవసరమైన అంశాలు పట్టించుకోవటం, అనవసర విషయాలు విస్మరించడం నేర్చుకోవాలన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న లారీ

టెక్కలి రూరల్: మండలంలోని జగన్నాథపురం గ్రామం వద్ద శుక్రవారం ఒక లారీ అదుపు తప్పి గ్రామం మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. మెళియాపుట్టి నుంచి టెక్కలి వైపు క్రేన్‌ను తీసుకువస్తున్న ఒక లారీ జగన్నాథపురం గ్రామం సమీపంలోకి వచ్చే సరికి అదుపు తప్పి రోడ్డు పక్కగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో రెండు స్తంభాలు విరిగిపోయాయి. విద్యుత్ వైర్లు తెగిపడిపోయాయి. అయితే ఈ సమయంలో సమీపంలో ఎవరూ లేక పోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. విద్యుత్ వైర్లు తెగిపడటంతో కరెంట్ అంతరాయం ఏర్పడింది. వెంటనే స్పందించిన విద్యుత్ శాఖాధికారులు మరమ్మత్తులు చేపట్టారు.

అంబేడ్కర్ వర్సిటీ పాలకమండలి సభ్యురాలిగా పేడాడ


పేడాడ రమణికుమారి

మర్రిపాలెం (విశాఖ): శ్రీకాకుళంలోని బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యురాలిగా వైఎస్సార్ సీపీ సీనియర్ మహిళా నాయకురాలు పేడాడ రమణికుమారి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి జె.శ్యామల రావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, స్పీకర్ తమ్మినేని సీతారాం, మంత్రి బొత్స సత్యనారాయణ, మంత్రి ధర్మాన ప్రసాదరావు, మాజీ మంత్రి ధర్మాన కృష్ణదాస్‌కు ఈ సందర్భంగా ఆమె కృతజ్ఞతలు తెలిపారు. జీవీఎంసీ 51వ వార్డులోని ఆమె నివాసంలో పలువురు రమణికుమారిని కలిసి అభినందించారు.

గవర్నర్ దృష్టికి వర్సిటీ ప్రగతి


గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందిస్తున్న బీఆర్ఏయూ వీసీ వెంకటరావు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ప్రగతిని రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్‌నజీర్‌కు వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు వివరించారు. విశాఖపట్నం పోర్టు అతిథి గృహంలో శుక్రవారం సాయంత్రం గవర్నర్‌ను వీసీ కలిసి సత్కరించారు. ప్రభుత్వం మంజూరు చేసిన పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని, అకడమిక్‌గా బలోపేతం చేయాలని, స్నాతకోత్సవాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని గవర్నర్ సూచించినట్లు వీసీ చెప్పారు.

వేతనాల పెంపుపై హర్షం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో బోధనేతర సిబ్బంది వేతనాలు పెంచుతూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఈ అంశంపై నిపుణుల కమిటీ వేసి అధ్యయనం, నివేదిక ఆధారంగా పెంచారు. వర్సిటీలో వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావును శుక్రవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

శివారు భూములకు ప్రాధాన్యత

- మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీదిరి అప్పలరాజు

శ్రీకాకుళం పాతబస్టాండ్:

జిల్లాలోని శివారు ప్రాంత పంట భూములకు సాగునీరు అందించాలని రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు నీటి పారుదల శాఖాధికారులను ఆదేశించారు. రైతు ప్రయోజనాల కోసమే నీటి పారుదల, వ్యవసాయ శాఖాధికారులు పనిచేయాలని సూచించారు. ఈ ఏడాది ఆగస్టు మాసంలో ఏర్పడిన వర్షాభావ విపత్కర పరిస్థితులు గత 120 ఏళ్లలో ఎన్నడూ లేవని, దేశవ్యాప్తంగా ఈ సమస్య వచ్చిందన్నారు. దీనివల్ల ఖరీఫ్‌కు, విద్యుత్‌కు సమస్యలు వచ్చాయన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి దీనిపై రెండుసార్లు సమీక్షలు నిర్వహించారని గుర్తుచేశారు. అదృష్టవశాత్తు గత మూడు రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయని, తద్వారా రైతుల్లో సానుకూల వాతావరణం కనిపిస్తోందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా నీటిపారుదల సలహా మండలి 30వ సమావేశం, జిల్లా స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం మత్స్య శాఖ మంత్రి అధ్యక్షతన కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ మొదలైందని, ఇందుకు అవసరమైన సాగునీటిని రైతులకు అందించేలా నీటి పారుదల శాఖధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. వర్షాభావ పరిస్థితులు బాగానే ఉన్నప్పటికీ షట్టర్లు, పూడిక, గుర్రపు డెక్క వంటి సమస్యలతో సాగునీరు అందించేందుకు తలెత్తుతున్న సమస్యల దృష్ట్యా తాత్కాలిక చర్యలు చేపట్టేందుకు ప్రతిపాదనలు సమర్పించాలని నీటిపారుదల శాఖాధికారులను మంత్రి ఆదేశించారు. ప్రస్తుతం జిల్లాలో వర్షాభావ పరిస్థితులు బాగానే ఉన్నందున తొలి ప్రాధాన్యత శివారు ప్రాంత పంట భూములకు సాగునీరు అందించాలని, ఆ తదుపరి ఎత్తిపోతల పథకాల ద్వారా సాగునీరు అందించాలని సూచించారు. రానున్న రెండు వారాలు శివారు భూములపై అధికారులు దృష్టి సారించాలని స్పష్టం చేశారు. సాగునీరు సరఫరాలో తలెత్తుతున్న సమస్యల పరిష్కారానికి రూ.10కోట్లతో తాత్కాలిక పనులు చేపట్టేలా ప్రతిపాదనలు తమకు సమర్పిస్తే, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి నిధులు మంజూరు చేసేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం వ్యవసాయంపై సమీక్షస్తూ జిల్లాలో ఈ–క్రాప్ పంట నమోదు, ఈకెవైసి తక్కువగా ఉందని, దీనిపై వ్యవసాయాధికారులు ప్రత్యేకదృష్టి సారించాలని అన్నారు.

- ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ మాట్లాడుతూ టెక్కలి నియోజక వర్గ పరిధిలో శివారు ప్రాంత పంట భూములకు సాగునీరు అందించాలని కోరారు. అలాగే మదనాపురం సాగరం నుంచి 600 క్యూసెక్కుల సాగునీరు అందించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను కోరారు.
- కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ మాట్లాడుతూ ప్రస్తుతం ఖరీఫ్ పంటకు సాగునీరు అందించడం చాలా ప్రధానమన్నారు. వంశధార నుంచి అందిస్తున్న సాగునీటిలో లష్కర్లు, గుర్రప్పుడెక్క సమస్యల పరిష్కారం కోసం జిల్లా నిధులు మంజూరు చేస్తున్న సంగతిని గుర్తు చేశారు. ఇంకా అదనపు నిధులు అవసరమైతే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని అన్నారు. రహదారులు, భవనాల శాఖాధికారులు సాగునీటికి అడ్డంగా ఉన్న కాజ్ వే లను తక్షణమే తొలగించాలని అన్నారు. రానున్న రెండు వారాలు సాగునీటిని శివారు ప్రాంత భూములకు అందించాలని అధికారులకు ఆదేశించారు.

సమావేశంలో మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్, ఎమ్మెల్సీ నర్తు రామారావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి, జిల్లా నీటిపారుదల సలహా మండలి, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్లు శిమ్మ నేతాజీ, చల్లా అలివేలు మంగ, కరిమి రాజేశ్వరరావు, సంయుక్త కలెక్టర్ ఎం.నవీన్, సహాయ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, వంశధార పర్యవేక్షక ఇంజినీర్ డోల తిరుమలరావు, జిల్లా వ్యవసాయ అధికారి కె.శ్రీధర్, నీటి పారుదల సలహా మండలి, వ్యవసాయ సలహా మండలి సభ్యులు, నీటి పారుదల శాఖ అధికారులు, అనుబంధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి


వినతిపత్రం అందిస్తున్న స్థానిక ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

- కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్
- లావేరులో 'జగనన్నకు చెబుదాం' నిర్వహణ

ఎచ్చెర్ల: ప్రజలు చెప్పిన సమస్యను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ తెలిపారు. లావేరు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లావేరు మండలంలో నిర్వహించిన జగనన్నకు చెబుతాం కార్యక్రమానికి 39 వినతులు వచ్చాయని, వీటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ మండలంలో రహదారుల అభివృద్ధిపై కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఎంపీపీ ప్రతినిధి రొక్కం బాలకృష్ణ, జెడ్పీటీసీ సభ్యులు, మీసాల సీతంనాయుడు, మాజీ ఎంపీపీ దన్నాన రాజీనాయుడులు మండల సమస్యలపై వినతి పత్రం అందించారు. ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు తమకు వేతనాలు పెంచాలని కోరారు. గుర్రాలపాలేం గ్రామాన్ని రెవెన్యూ విలేజ్‌గా గుర్తించాలని అక్కడి వారు కోరారు. లావేరు గ్రామానికి చెందిన ఎస్సీ కుటుంబాలు తమకు పట్టాలిచ్చారని అయితే ఇంత వరకూ స్థలాన్ని చూపించలేదని, తమ పట్టాలకు వెంటనే స్థలాన్ని గుర్తించి అందించాలని కోరుతూ వినతి పత్రం అందించారు. తమురు కాలువకు గండి పడి చాలా కాలమవుతోందని, పూడ్చాలని తాళ్లవలస గ్రామస్తులు, బస్సు సౌకర్యం కల్పించాలని కుంకాం గ్రామస్తులు కోరారు.

ప్రజలకు వివరించాలి

ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలను ఎప్పటికప్పుడు ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు ప్రజలకు తెలియకపోవడం వల్లే చాలా వినతులు వస్తున్నాయని అన్నారు.

సచివాలయాలను ముందంజలో ఉంచాలి

మండలంలోని వెనుకంజలో ఉన్న సచివాలను గుర్తించి వాటిని అభివృద్ధి చేయడానికి నోడల్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో వెనుకంజలో ఉన్న 30 శాతం అంటే 220 సచివాలయాలను గుర్తించామని, లావేరు మండలంలోని 6 సచివాలయాలను గుర్తించామన్నారు. ఒకటిరెండు నెలల్లో సచివాలయాలను ముందంజలో ఉంచాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్పీ జీఆర్ రాధిక, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్ర మీన, డీఆర్‌డీఏ పీడీ డీవీ విద్యాసాగర్, జెడ్పీ సీఈఓ వెంకటరమణ, హౌసింగ్ పీడీ గణపతి, ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ, ఇన్‌చార్జి ఆర్డీవో జయదేవ్, డీఎంహెచ్‌ఓ బి.మీనాక్షి, ఎంఆర్ఓ దిలీప్ చక్రవర్తి, ఎంపీడీఓ కె.సురేష్‌కుమార్, జిల్లా స్థాయి, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ప్రజల దృష్టి మళ్లించేందుకే అసత్య ప్రచారాలు

- కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి



టెక్కలి: చంద్రబాబు అవినీతిపై ఐటీ శాఖ నోటీసులు ఇవ్వడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోందని, దీనిపై జిల్లా ప్రజల దృష్టిని మళ్లించేందుకు తనపై సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తున్నారని కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. చంద్రబాబు చేసిన కుంభకోణంతో జిల్లాలో గల టీడీపీ నాయకుల్లో భయం మొదలైందని ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులపై బురదజల్లే ప్రయత్నంలో భాగంగా తాను టీడీపీలో చేరుతున్నట్లు సోషల్ మీడియాలో దుష్ప్రచారాలు చేస్తున్నారని ఆమె మండిపడ్డారు. రానున్న రోజుల్లో జిల్లాలో టీడీపీ మనుగడ పూర్తిగా ప్రశ్నార్థకంగా మారుతుందని కృపారాణి వెల్లడించారు. దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుటుంబంతోనే తన రాజకీయ జీవితం కొనసాగుతుందని స్పష్టం చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఈ రోజు దేశ వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందాయని కృపారాణి పేర్కొన్నారు. తనపై టీడీపీ నాయకులు చేసిన తప్పుడు ప్రచారాలపై వైఎస్సార్ కుటుంబ సభ్యులు ఎలాంటి ఆందోళన చెందవద్దని కృపారాణి తెలిపారు.

సోదరుని ఇంటిపై దాడి

ఎచ్చెర్ల క్యాంపస్: వ్యక్తిగత కక్షలు, ఆస్తి తగాదాల నేపథ్యంలో కొత్తపేటలో శుక్రవారం బొడిగి గోవిందరావుపై సొంత సోదరులు దాడికి పాల్పడ్డారు. గ్రామస్తులు, పెద్దలు చూస్తుండగానే ఇంటిలో నిర్వహిస్తున్న దుకాణంలో వస్తువులు చెల్లాచెదురుగా విసిరేశారు. మరో పక్క కర్రలు, ఇనుప ఊసలతో ఇంటి ముందు ఉన్న సిమ్మెంట్ రేకును, ఇంటి ముందు భాగాన్ని ధ్వంసం చేశారు. ఈ వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేయగా, ఎస్ఐ సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు. వీరు ఆరుగురు అన్నదమ్ములు కాగా, నలుగురు అన్నలు, కుటుంబ సభ్యులు మాకుమ్మడిగా దాడి చేశారు. గ్రామస్తులు వారిస్తున్నా వినలేదు.

బీజేపీ విజయనగరం జిల్లా అధ్యక్షుడిగా ఎన్ఈఆర్


ఎన్.ఈశ్వరరావు

రణస్థలం: భారతీయ జనతా పార్టీ విజయనగరం జిల్లా అధ్యక్షుడుగా ఎన్.ఈశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షురాలు డి.పురందేశ్వరి నుంచి ఉత్తర్వులు జారీ అయినట్టు ఆయన శుక్రవారం తెలిపారు. తనపై ఉంచిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరికి కృతజ్ఞతలు తెలియజేశారు.

'పాఠకులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తాం'


జిల్లా గ్రంథాలయ కమిటీ సమావేశం

శ్రీకాకుళం అర్బన్: జిల్లాలో గ్రంథాలయాలను సందర్శించే పాఠకుల సౌకర్యార్థం అన్ని మౌలిక సౌకర్యాలూ కల్పిస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సువ్వారి సువర్ణ అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో శుక్రవారం 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆదాయ, వ్యయాలతో కూడిన బడ్జెట్ పరిశీలన, ఆమోదం కోసం కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రూ.10 కోట్ల 24 లక్షల 44 వేల 810 తో రూపొందించిన బడ్జెట్‌కు కమిటీ ఆమోదం తెలిపింది.

పాఠకులకు అందుబాటులో పుస్తకాలు

గ్రంథాలయాల్లో పాఠకులకు ఉపయోగపడే పుస్తకాలు అందుబాటులో ఉంటాయని సువ్వారి సువర్ణ అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయం, జిల్లాలో గల శాఖా గ్రంథాలయాలకు సాధారణ పుస్తకాలు సరఫరా చేసేందుకు ఒక్కో సబ్జెక్టులో నిష్ణాతులైన వారిని ఎంపిక చేసి వారి ద్వారా పుస్తకాలను ఎంపిక చేసి కమిటీ ఆమోదం మేరకు పుస్తక పబ్లిషర్స్, రచయితలకు ఎంపిక ఆధారంగా ఆర్డర్లు ఇవ్వడం జరిగిందని సువ్వారి సువర్ణ చెప్పారు. పుస్తకాలు పాఠకులకు అందుబాటులో ఉంచుతామన్నారు.

'నేత్రదానానికి ముందుకు రావాలి'

అరసవల్లి: నేత్రదానానికి స్వచ్ఛందంగా ముందుకు రావాలని తద్వారా అంధత్వ నివారణ సాధ్యమవుతుందని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి బి.మీనాక్షి పిలుపునిచ్చారు. శుక్రవారం జాతీయ నేత్రదాన పక్షోత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించిన ర్యాలీని ఆమె లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత నెల 25 నుంచి ఈనెల 8 వరకు ఈ పక్షోత్సవాలను నిర్వహించారని, నేత్రదానంపై కుటుంబసభ్యులు అవగాహన పెంచుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో జిల్లా అంధత్వ నివారణాధికారి డాక్టర్ త్రినాథరావు, రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు జీజేహెచ్ నేత్రవిభాగాధికారి నిర్మలాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు

- విశాఖలో జిల్లా వాసి దుర్మరణం


మృతుడు రాంబాబు (ఫైల్)

గోపాలపట్నం (విశాఖ): పీఎఫ్ పని మీద శ్రీకాకుళం జిల్లా నుంచి విశాఖ వచ్చిన ఓ యువకుడిని కారు రూపంలో మృత్యువు కాటేసింది. ఎన్ఏడీ సమీపంలోని కాకానినగర్ జాతీయ రహదారిపై పంజాబీ దాబా వద్ద గురువారం అర్ధరాత్రి ఈ ప్రమాదం జరిగింది. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలివీ..

శ్రీకాకుళం జిల్లా పోలాకి మండలం గోవిందపురానికి చెందిన పందిరి రాంబాబు(28) నరసన్నపేటలోని ఓ ప్రైవేట్ కళాశాలలో అకౌంటెంట్‌గా పని చేస్తున్నాడు. పీఎఫ్ కార్యాలయంలో పని ఉండడంతో అతని స్నేహితుడు పెద్దిని మన్మథతో కలిసి గురువారం రాత్రి విశాఖ వచ్చారు. బుచ్చిరాజుపాలెం రెడ్డి వీధికి చెందిన అతని స్నేహితుడు సురేష్ ఇంటికి వెళ్లారు.

అర్ధరాత్రి సమయంలో వీరి ముగ్గురూ బైక్‌పై పంజాబీ దాబాకు భోజనానికి వెళ్లారు. ఈ క్రమంలో బైక్‌ను రహదారిపై నుంచి ఎడమ వైపు తిప్పుతున్న సమయంలో వెనుకనే వస్తున్న గుర్తు తెలియని కారు వీరిని ఢీకొట్టింది. ఈ ఘటనలో రాంబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. సురేష్, మన్మధకు గాయాలయ్యాయి. రాంబాబుకు తండ్రి, అన్నయ్య ఉన్నారు. సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

జెమ్స్‌లో ఫిజియోథెరపీ దినోత్సవం


ఫిజియోథెరపీ సదస్సులో సదస్సులో పాల్గొన్న జెమ్స్ సిబ్బంది

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో శుక్రవారం ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎంఈ, ప్రోగ్రాం, విద్యార్థులకు సైంటిఫిక్ పోస్టర్ పోటీలు జరిగాయి. అనంతరం ఇన్‌ఫ్లామెటరీ, ఆర్థరైటిస్, రుమాటాయిడ్ ఆర్థరైటిస్‌పై అవగాహన సదస్సు జరిగింది. జెమ్స్ ఆస్పత్రిలో నాణ్యమైన విద్య అందుబాటులో ఉందని, ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలని కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాహుల్ తెలిపారు.

బాబు, లోకేష్‌లవి శవ రాజకీయాలు

- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్



నరసన్నపేట: రానున్న ఎన్నికల్లో మళ్లీ ఓటమి తప్పదని ముందే గ్రహించిన చంద్రబాబు ఆయన కుమారుడు లోకేష్‌లు శవ రాజకీయాలు చేసి లబ్ధి పొందాలని చూస్తున్నారని, అయితే ప్రజలు అన్నీ గమనిస్తున్నా రని, నరసన్నపేట ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. గడిచిన సార్వత్రిక ఎన్నికల నుంచి అన్ని ఎన్నికల్లోనూ జనం ఛీకొట్టినా బాబు అండ్ కోకు బుద్ధి రాలేదన్నారు. యువగళం పేరుతో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్నామని టీడీపీ గొప్పలు చెప్పుకుంటున్నా.. యువగళాన్ని ప్రజలు మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. సంఘవిద్రోహ శక్తులు, రౌడీ షీటర్లతో యువగళాన్ని నిర్వహిస్తున్నారని, వీరే ఎర్ర టీషర్టుల ముసుగులో దాడులు చేస్తున్నారని కృష్ణదాస్ విమర్శించారు. భీమవరం ఘటనే దీనికి ఉదాహరణ అని తెలిపారు. ప్రజలు వైఎస్ జగన్ వెంటే ఉన్నట్లు తెలుసుకున్న టీడీపీ శ్రేణులు హింసను ప్రేరేపిస్తున్నారని అన్నారు. పుంగనూరు, భీమవరంల్లో బాబు, లోకేష్‌ల కనుసన్నల్లోనే హింస జరిగిందని, పోలీసులకు గాయాలు కావడానికి, టీడీపీ శ్రేణులు రెచ్చిపోవడానికి కారణం వారి ప్రసంగాలేనని ఆరోపించారు. 14 ఏళ్లు సీఎంగా పనిచేసిన చంద్రబాబు మాటలు వింటే సిగ్గుచేటు అనిపిస్తోందన్నారు. పక్కా ప్లాన్ ప్రకారం దాడులు చేస్తుంటే ఆ దాడులను దత్తపుత్రుడు, బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి, కమ్యూనిస్టు పార్టీ నాయకులు ఖండించక పోవడం శోచనీయమన్నారు. తిరిగి టీడీపీ వాళ్లకు గాయాలు అవుతున్నాయని ఎల్లో మీడియా చూపిస్తుంటే ఇంత కంటే ఘోరం ఉందా అని ప్రశ్నించారు. చంద్రబాబులో అసహనం పెరుగుతూ ఏదేదో మాట్లాడుతున్నారని అన్నారు.

మస్టర్ల మాయాజాలం

ఆమదాలవలస రూరల్: స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో శుక్రవారం డ్వామా పీడీ చిట్టిరాజు ఆధ్వర్యంలో 29 గ్రామ పంచాయతీలకు సంబంధించి సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించారు. ప్రతి గ్రామంలో ఎంబుక్‌లో వేతనదారుల వివరాలు నమోదు లేకుండానే వేతనాలు చెల్లించినట్టు గుర్తించారు. దూసి గ్రామ పంచాయతీలో ఉపాధి పనులు కల్పించలేదని వలంటీర్లు తెలియజేశారు. ఉపాధి కూలీలు పని ప్రదేశానికి రాకుండానే వారి పేర్లను మస్టర్లల్లో నమోదు చేసి, మస్టర్లు దిద్దుబాట్లు చేసినట్లు కొన్ని గ్రామాల్లో గుర్తించారు.

'బాల్య వివాహాలను అరికడదాం'

రణస్థలం: రాష్ట్రంలో బాల్య వివాహాలను పూర్తిస్థాయిలో నిర్మూలించాలంటే స్థానిక ప్రజా ప్రతినిధుల సహాయ సహకారాలు అవసరమని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం అన్నారు. మండల కేంద్రంలోని ఒక కల్యాణ మండపంలో ఐసీడీఎస్ రణస్థలం స్త్రీ, శిశు సంక్షేమశాఖ పీఓ సీహెచ్ ఝాన్సీబాయ్ ఆధ్వర్యంలో రణస్థలం, లావేరు మండలాల అధికారులతో బాల్య వివాహాల నిర్మూలనపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమంగా బాల్య వివాహాలు జరిగితే అధికారులు తప్పనిసరిగా కేసులు నమోదు చేయాలని, అందుకు ప్రజా ప్రతినిధుల సహకారం తప్పనిసరిగా ఉండాలన్నారు. ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్టు అధికారి బి.శాంతిశ్రీ మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తల నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. వివాహ రిజిస్ట్రేషన్లు తప్పనిసరిగా జరగాలన్నారు. కై లాష్ సత్యార్థి ఫౌండేషన్ రూపొందించిన బాల్య వివాహాల నిర్మూలన గోడ పత్రికను అవిష్కరించారు. తొలుత జే.ఆర్.పురం పంచాయతీలోని గరికిపాలెం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు.

'విద్వేషాలు రగిలిస్తున్నారు'


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, సాయిరాజ్

సోంపేట: చంద్రబాబు నాయుడు, ఆయన కుమారుడు లోకేష్ యాత్రల పేరుతో ప్రాంతాల మధ్య విద్వేషాన్ని రగిలిస్తున్నారని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ అన్నారు. పిరియా సాయిరాజ్ ఆధ్వర్యంలో సోంపేటలో పార్టీ నాయకులతో కలిసి శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా పనిచేసిన సమయంలో జరిగిన అవినీతిపై భారత ఐటీ శాఖ నోటీసులు ఇస్తే సమాధానం చెప్పకుండా బుకాయించడం చంద్రబాబుకే చెల్లిందన్నారు. చంద్రబాబు పక్కా ఆధారాలతో దొరికా రు కాబట్టే ఐటీ శాఖ నోటీసులు ఇచ్చిందని స్పష్టం చేశారు. బాబును ప్రజలు నమ్మబోరని, ఆ అవినీతి డొంక దగ్గరలోనే కదులుతుందన్నారు. లోకేష్ పాదయాత్రలో సంఘ విద్రోహ శక్తులు, రౌడీ షీటర్లు ఉన్నారనే అనుమానం కలుగుతోందన్నారు. పుంగనూరు, భీమవరంలో హింసను ప్రేరేపించి, పోలీసులపై దాడి చేయించిన ఘనత తండ్రీకొడుకులకు దక్కుతుందన్నారు. సమావేశంలో సోంపేట, కంచిలి ఎంపీపీలు డాక్టర్ నిమ్మన దాస్, పైల దేవదాస్ రెడ్డి, వైస్‌ఎంపీపీ రేగు ప్రేమ, ఉప స ర్పంచ్ వెంకటరమణ, నాయకుడు ఐ.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,380–00
బంగారం(22సి. 10గ్రా.)	55,350–00
వెండి (కిలో)	80,000–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹210	₹ 220